గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి ఎస్.బాబూరావు అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు గ్రంథాలయాలు-ప్రయోజనాలు అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై గ్రంథాలయంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు వెళ్లటం, పుస్తకాలు చదవటం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులకు కథలు చెప్పటం, వారితో కథలు చదివించటం, జనరల్ నాలెడ్జ్ నృత్యాలు, చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం లైబ్రేరియన్ స్వర్ణ లతాదేవి, రిటైర్డ్ ఉద్యోగి ఎస్.బాబూరావు గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలను, జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకోవటం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కంకిపాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా తెన్నేరు గ్రంథాలయంలో విద్యార్థులకు నృత్యం, ఆటల పోటీలు నిర్వహించారు. యోగాలో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి సునీత మాట్లాడుతూ.. చదువు, ఆటలతో పాటు మానసిక, శారీరక వికాసాన్ని, ఆరోగ్యాన్ని అందించే యోగా కూడా ముఖ్యమేనన్నారు. ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకుని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు.

వణుకూరు గ్రంథాలయంలో

పెనమలూరు: వణుకూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులు గురువారం ఉత్సాహంగా పాల్గొన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం, నీతి కథలు చెప్పించటం చేశారు. అనంతరం విద్యార్థులకు పలు ఆటలు ఆడించారు. గ్రంథాలయంలో గత కొద్ది రోజులుగా పూర్తి స్థాయిలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు. పెనమలూరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులతో నీతి కథలు చెప్పించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచటానికి వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని గ్రంథాలయ అధికారి హరీష తెలిపారు.

విద్యపై ఆసక్తి పెంచుకోవాలి

గన్నవరంరూరల్: విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గురువారం స్థానిక లైబ్రరీలో విద్యార్థులకు ఉన్నతంగా చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రపంచంలో గొప్ప స్థితికి చేరిన వారందరు చదువుకున్న వారేనని, పుస్తకాలు చదవటం వల్ల ఉన్నతి లభిస్తుందని చెప్పారు. చదువు మన వద్ద ఉండే సంపద అని, దానిని ఎవరూ దొంగిలించలేరని, ప్రపంచ వేదికలపై కీర్తించబడాలంటే చదవటం ఒక్కటే మార్గమన్నారు. స్థానిక సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ రత్నకుమారి విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లో నేర్చుకున్న అంశాలపై క్విజ్ కాంపిటేషన్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ముస్తాబాదలో శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా నేర్పించారు. రోజు వారి జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉంగుటూరులో విద్యార్థులకు పోటీలు

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా శాఖ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో నిర్వహిస్తున్న క్విజ్, ఆటల పోటీల్లో గురువారం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శిబిరాలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఉంగుటూరు, తేలప్రోలు, ఆత్కూరు, మానికొండ గ్రామాల్లో గ్రంథాలయల్లో పుస్తక పఠనం, కథలు, న్యూస్ పేపర్ చదివించారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్, స్నేక్ అండ్ లేడర్, లెమన్ స్పూన్ వంటి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు.


పెనమలూరులో కథలు చెబుతున్న విద్యార్థులు


వణుకూరు గ్రంథాలయంలో శిక్షణ శిబిరానికి హాజరైన విద్యార్థులు


తెన్నేరులో యోగాలో శిక్షణ పొందుతున్న చిన్నారులు


పురుషోత్తపట్నంలో పోటీలు నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రత్నకుమారి


ఉంగుటూరులో కథలు చెబుతున్న విద్యార్థిని

మిద్దె పంటలతో ఆరోగ్యం

ప్రస్తుతం మనం కూరగాయలు కాని, పండ్లు కాని ఏవి తినాలన్నా భయపడే రోజులివి. ఏ పంటలో చూసినా రైతులు చీడపీడల నివారణ కోసమో, అధిక దిగుబడి కోసమో రసాయనాలు విపరీతంగా వాడేస్తున్నారు. దాంతో రైతులు పండించిన కూరగాయలు, పండ్లు అన్నీ రసాయన కాలుష్యంతో నిండి ఉంటున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో మనం అవి తిని లేనిపోని అనారోగ్యాలు తెచ్చుకుంటున్నాము. ఈ నేపథ్యంలో ఆర్గానిక్ పంటలపై ఇప్పుడిప్పుడే ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. నగరంలోని భారతీ నగర్‌లో ఓ ఇంట్లో మేడపైనే కూరగాయలు, పండ్లు పండిస్తూ వారు స్వచ్ఛమైన ఆహారం తీసుకుంటూ ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా ఉంటున్నారు. చుట్టుపక్కల వారందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.


జామచెట్టుకు కాసిన కాయలు


మేడపైన ఏర్పాటు చేసిన కుండీలు

- మేడపైన కూరగాయల పెంపకం
- వివిధ రకాల పండ్ల మొక్కల పెంపకం
- ఏడాది పొడవునా కుటుంబానికి సరిపోతున్న వైనం

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడలోని భారతీనగర్‌లో ఓ ఇంటి మేడపైనే గత కొద్ది సంవత్సరాల నుంచి కూరగాయలు, వివిధ రకాల పండ్లను పండిస్తున్నారు. ఇంటికి సరిపడా కావలసిన దాని కంటే అధికంగా దిగుబడి సాధిస్తున్నారు. ఇంటిల్లిపాదీ స్వచ్ఛమైన పంటలను తింటూ ఆరోగ్యంగా ఉంటున్నారు.

ఇతరులకు కూడా కొంతమేరకు సేంద్రియ పంటలను అందిస్తున్నారు. భారతీనగర్‌కు చెందిన మైనేని సాయిబాబు దంపతులు తమ ఇంటి పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద కుండీలలో 10 రకాలకు పైగా కూరగాయల మొక్కలు, ఆకు కూరల మొక్కలను వేశారు. ఇందులో భాగంగా వంగ, టమోట, గోంగూర, చుక్కకూర, బీరకాయ, సొర కాయలను పందిరిగా వేసి పండిస్తున్నారు. అంతే కాకుండా సపోట, జామకాయ, దానిమ్మ, అరటి మొక్కలను కూడా వేశారు. ఇవన్నీ విరగకాస్తున్నాయి.

బయట కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా మేడపైన పండుతున్న కూరగాయలు, పండ్లే తమకు సరిపోతున్నాయని సాయిబాబు చెబుతున్నారు.


విరగకాసిన సపోట కాయలు

కుండీల్లో ఎర్రమట్టి...

కూరగాయలు, పండ్ల మొక్కలను వేసేందుకు గాను సుమారు 50 కిలోమీటర్ల దూరం నుంచి ఎర్ర మట్టిని తీసుకు వచ్చి వీటిని నాటినట్టు చెప్పారు. దీని ఆలనా పాలనా చూడటానికి ఇద్దరు కూలీలను పెట్టారు. వీటికి నీరు పెట్టడానికి ప్రత్యేకంగా పైపులను ఏర్పాటు చేశారు. దీనిపై వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రస్తుతం జామ, సపోట, దానిమ్మ చెట్లు విరగకాస్తున్నాయి.

ఆరోగ్యంగా ఉంటున్నాం

ప్రస్తుతం బయట దొరికే కూరగాయలు, పండ్లు అధికంగా రసాయన ఎరువులతో పండిస్తున్నారు. వీటి ద్వారా అనారోగ్య పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తోంది. ఈ ఉద్దేశంతో తాము గత కొద్ది సంవత్సరాల నుంచి మేడ పైన ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కుండీల్లో కూరగాయలు, పండ్లు పండిస్తున్నాం. ఇంట్లోనే సేంద్రియ ఎరువులతో వీటిని పండిస్తున్నాం. ఆరోగ్యకరమైన కూరగాయలు, పండ్లు తినగలుగుతున్నాం. ఇంట్లో వాళ్లమంతా ఆరోగ్యంగా ఉంటున్నాం.

– మైనేని సాయిబాబు, ఇంటి యజమాని

గన్నవరాన్ని పట్టిపీడిస్తున్న డంపింగ్ యార్డు సమస్య


ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా పేరుకు పోయిన చెత్త నిల్వలు

గన్నవరం: నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డు సమస్య పట్టిపీడిస్తోంది. సుమారు 30 వేలకుపైగా జనాభా కలిగిన ఈ గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలం లేదు. దీంతో గ్రామంలో సేకరించిన చెత్తను స్థానిక కోనాయి చెరువు వద్ద ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా డంప్ చేస్తున్నారు. ఫలితంగా ఆ ప్రాంతంలో చెత్తకుప్పలు పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. ఐదు నెలలు క్రితం సుమారు రూ.8 లక్షలు గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి ఇక్కడ చెత్తను తొలగించి గొల్లనపల్లి శివారులో డంప్ చేశారు. అనంతరం గొల్లనపల్లి ప్రాంత రైతులు అడ్డుకోవడంతో చెత్త తరలింపు ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామంలో సేకరించిన చెత్తను పంచాయతీ సిబ్బంది కోనాయి చెరువు వద్ద డంప్ చేస్తుండడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. చెత్త కుప్పలు పెరిగిపోయి రోడ్డుపైకి చేరడంతో పాటు తీవ్ర దుర్వాసన వస్తుండడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించాలని పంచాయతీ పాలకవర్గం కొంత కాలంగా రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్థల కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రహదారులు 'దమ్ము'

- ఇనుప బద్దీ లేకుండా దమ్ము ట్రాక్టర్ల రాకపోకలు
- ధ్వంసమవుతున్న రహదారులు
- చర్యలు తీసుకోని అధికారులు


ఇనుప బద్దీ లేకుండా సిమెంటు రోడ్డుపై వెళ్తున్న దమ్ము ట్రాక్టర్

కంకిపాడు: రైతులు వడివడిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం అవుతున్నారు. వరి నారుమడులు పోసుకునేందుకు భూమిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ తరుణంలో దమ్ము ట్రాక్టర్లు యథేచ్ఛగా రోడ్లపై సంచరిస్తున్నాయి. రహదారులు ధ్వంసమైపోతున్నా అధికారులు కన్నెత్తి చూడటం లేదు.

పనుల్లో రైతుల నిమగ్నం

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 42 వేల ఎకరాల్లో సాగుకు అనువైన భూమి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి సాగును ప్రధానంగా ఎంచుకుని సాగు చేస్తున్నారు. వేసవి దుక్కులు పూర్తి చేసుకున్న రైతులు వాతావరణ మార్పులతో వరి నారుమడులను పోసుకునేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే విత్తనాలను సేకరించి నిల్వ చేసుకున్నారు. బోరు సదుపాయం ఉన్న ప్రాంతాల్లో వరి నారుమడులు పోసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

దమ్ము ట్రాక్టర్ల హల్‌చల్..

వరి నారుమడులను సిద్ధం చేసుకునేందుకు, వరి నాట్లు వేసేందుకు భూమిని దమ్ము చేయాల్సి ఉంది. దీనికి గానూ రైతులు దమ్ము ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. ట్రాక్టర్‌కు దమ్ము చక్రాలను తగిలించి యథేచ్ఛగా రోడ్లపై తిప్పటం వల్ల దమ్ము చక్రాల కింద రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. దమ్ము చక్రాలకు ఇనుప బద్దీని తగిలించి రాకపోకలు సాగించాలనే నిబంధన ఉంది. కానీ దమ్ము ట్రాక్టర్ల యజమానులు చాలా వరకూ ఇనుప బద్దీలను వాడటం లేదు. ఫలితంగా రహదారులు ధ్వంసం అవుతున్నాయి.

అధికారులు పరిశీలించాలి..

గ్రామీణ ప్రాంతంలో ముఖ్యంగా పంచాయతీ రాజ్, జిల్లా పరిషత్, ఆర్అండ్‌బీ, ఆఖరికి జాతీయ రహదారి మీదకు సైతం ఇనుప బద్దీ లేకుండానే చాలా వరకూ దమ్ము ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఆయా శాఖల రహదారులకు అపార నష్టం జరుగుతోంది. ఖరీఫ్, రబీ సీజన్ ఏదైనా దమ్ము ట్రాక్టర్లు ఇనుప బద్దీ లేకుండా రాకపోకలు సాగించటంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమస్య పరిష్కారం కాకుండానే సమ్మె విరమణ


కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాన్ డ్రైవర్లు

పెనమలూరు: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలో గత కొద్ది రోజులుగా చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు చేస్తున్న సమ్మెను గురువారం విరమించినట్లు ప్రకటించారు. అయితే వీరి డిమాండ్‌లు మాత్రం పరిష్కారం కాలేదు. తాడిగడప మున్సిపాలిటీలో తడిచెత్త పొడి చెత్త తరలించటానికి దాదాపు 40 చెత్త తరలించే వ్యాన్‌లు ఉన్నాయి. అవి కాంట్రాక్టర్ పరిధిలో పని చేస్తాయి. అయితే తాడిగడప మున్సిపాలిటీ సకాలంలో బిల్లులు చెల్లించినా కాంట్రాక్టర్ గత రెండు నెలలుగా డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేదని డ్రైవర్లు ఆరోపించారు. దీంతో డ్రైవర్లు గత రెండు వారాలుగా సమ్మె చేస్తున్నారు. మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వరరావు హామీ ఇచ్చినా సమ్మె విరమించలేదు. అయితే తాజాగా గురువారం కమిషనర్ వెంకటేశ్వరరావును వినతిపత్రం డ్రైవర్లు అందజేశారు. కమిషనర్ హామీ ఇచ్చారని సమ్మె విరమించారు. రెండు వారాలుగా డ్రైవర్లు చేసిన సమ్మెకు డిమాండ్లు వాస్తవ రూపంలో పరిష్కారం కాలేదు. రెండు వారాలుగా మున్సిపాలిటీ పరిధిలో జనాలు చెత్తకుప్పలతో ఇబ్బందులు పడ్డారు. కాగా కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, మస్తాన్‌వలి, టీడీపీ నేత అనుమోలు ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతాంగం



విజయవాడరూరల్: రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ పంటలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. రైతాంగం గ్రామాల్లో ట్రాక్టర్లతో వ్యవసాయ భూములను దుక్కులు దున్నుతున్నారు. కొద్ది రోజుల్లో వరినారు మళ్ల పోయడం తదుపరి నాట్లు వేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలో ఈ ఏడాది నాలుగు వేల హెక్టార్లలో ఖరీఫ్ సాగు జరుగుతుందన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. వరి విత్తనాలు కలిగి ఉన్న రైతులు బోర్ల కింద ఇప్పటికే నారుమళ్లు పోసుకున్నారని ఏవో తెలిపారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో చండీ హోమం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వైశాఖ అమావాస్యను పురస్కరించుకుని భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం రుద్రాభిషేకం, చండీహోమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌శర్మ పర్యవేక్షణలో అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు.

క్లుప్తంగా

ముగిసిన పింఛన్ల పంపిణీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో సామాజిక భద్రత పింఛన్లు 98.98 శాతం పంపిణీ చేశామని ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 17,378 పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేయగా వాటిల్లో 17,194 పింఛన్లు అందజేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 1,408 మంది దివ్యాంగులకు ఇంటి వద్ద పింఛన్లు అందించామని, మిగిలిన వారికి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశామని చెప్పారు. మొత్తం 98.98 శాతం మంది లబ్ధిదారులకు గాను 5 కోట్ల 16 లక్షల 38 వేల రూపాయల పింఛన్లు అందించామన్నారు. పింఛన్ల పంపిణీ ముగిసిందని చెప్పారు.

టీడీపీ కార్యకర్తల అత్యుత్సాహం



కంకిపాడు: ప్రశాంత పల్లెల్లోనూ టీడీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో విజయోత్సవాల పేరుతో ఆ పార్టీ కార్యకర్తలు ఇష్టానుసారం చేస్తున్న చర్యలు కొనసాగుతున్నాయి. మొన్న వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం బోర్డులో వైఎస్సార్ పేరు తొలగించారు. తాజాగా మండలంలోని గొల్లగూడెం గ్రామంలో టీడీపీ కంటే వైఎస్సార్ సీపీకి 89 ఓట్ల మెజారిటీ వచ్చింది. దీన్ని జీర్ణించుకోలేని ఆ పార్టీ కార్యకర్తలు గ్రామ పంచాయతీ కార్యాలయంపై టీడీపీ యువగళం పాదయాత్ర జెండాను ఎగురవేశారు. అదే గ్రామంలో ఉన్న బస్‌షెల్టర్‌పై జై టీడీపీ అంటూ అక్షరాలు రాశారు. అక్కడితో ఆగకుండా వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెకు పసుపు రంగు రాశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టే విధంగా ఆ దిమ్మెపై టీడీపీ అని రాశారు.

ఆస్తుల ధ్వంసం, దాడులు సరికాదు

విజయవాడరూరల్: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆస్తుల ధ్వంసం, దాడులు సరికాదని ఆ పార్టీ నాయకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ విజయవాడ రూరల్ మండల నాయకుడు, విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు(కోటేశ్వరరావు)ఇంటి వద్ద సెల్లార్‌లో పార్కు చేసిన కారు అద్దాలు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తుల చర్యలను ఆ పార్టీ నాయకులు ఖండించారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, అర్ధరాత్రి వేళల్లో దాడులు చేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం అనైతిక చర్యలుగా నాయకులు పేర్కొన్నారు. అంబాపురం గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో కన్వీనర్ తోడేటి బెంజిమెన్, పి.నైనవరం గ్రామ పార్టీ కన్వీనర్ దావు వెంకటేశ్వరరావు, పాతపాడు గ్రామ పార్టీ నాయకులు కలపాల అబ్రహాం, శివరాజు, నున్న గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, పలువురు పార్టీ శ్రేణులు దాడిని ఖండించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధురాలు గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బస్టాండ్ సెంటర్‌కు సమీపంలోని భెల్ కంపెనీ వెనుక రోడ్డులో గుర్తు తెలియని వృద్ధురాలు మూడు రోజుల క్రితం స్పృహ తప్పి పడిపోయింది. స్థానికులు 108కు ఫోన్ చేసి సదరు వృద్ధురాలని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు గురువారం మృతి చెందింది. మృతురాలు ఎర్ర రంగు చీర పచ్చ రంగు జాకెట్ ధరించి ఉంది. వయసు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలియకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి సీఐ సీహెచ్ సతీష్ కుమార్ తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వ్యక్తులు ఎవరైనా ఉంటే 08672-252233 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం తెలియజేయాలని తెలిపారు.

నేరస్తుడి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ సామాన్య ప్రజా జీవనానికి భంగం కలిగిస్తున్న నేరస్తుడు కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి అలియాస్ బారు రెడ్డి నగర బహిష్కరణను పొడిగిస్తూ పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిందితుడు బారురెడ్డి గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించాడని, జైలు నుంచి విడుదలైన తరువాత అతని ప్రవర్తనలోఎలాంటి మార్పు రాకపోవడంతో గతంలోనే నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగించినట్లు స్పష్టం చేశారు.